క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు




డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు
తన్నీరు నాగేశ్వరరావు

నందిగామటౌన్/జగ్గయ్యపేటఅర్బన్: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ పండుగ దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. అల్లా దీవెనలతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు.

ప్రజలందరికీ మేలు చేకూరాలి



పెనుగంచిప్రోలు: నూతన సంవత్సరం అందరికీ సుఖాలు కలిగించాలని శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు , ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆంజనేయశర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. ఈఏడాది విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా పడటంతో పాటు పాడిపంటలు బాగుంటాయన్నారు. సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలరాలు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి ఆలయంలో కూడా పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీఅయ్యప్పసేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ఆదివారం సర్పంచ్ రమావత్ కోటి యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఉగాది పండుగ సందర్భంగా కార్మికులకు ఏటా యూనిఫాం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మీర్జావలి, వార్డు సభ్యులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

శామ్యూల్‌కు సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కన్నమాల శామ్యూల్‌ను ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. వట్టెం మనోహర్, మాజీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు చౌడవరపు జగదీష్ తదితర నేతలు శామ్యూల్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో శామ్యూల్ మరింతగా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ కార్మిక, ప్రచార విభాగాల పట్టణ అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, ఎస్సీసెల్ నాయకులు శీలం మంగారావు, దార్ల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి గద్దే సరస్వతి కన్నుమూత



కంచికచర్ల : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కంచికచర్ల మాజీ సర్పంచి గద్దే సరస్వతి(85) విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. 2001–06 మధ్య ఆమె కంచికచర్ల సర్పంచిగా గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. రాజకీయపార్టీలకతీతంగా పలువురు నాయకులు సరస్వతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వంటపాత్రలు బహూకరణ



వత్సవాయి: చిట్టేల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. భోజనాన్ని తయారుచేసేందుకు కావల్సిన వంటపాత్రలను మక్కపేట గ్రామానికి చెందిన దారాబోయిన వీరబాబు దంపతులు రూ.50 వేల వెచ్చించి కొనుగోలు చేసి ఆలయానికి బహూకరించారు. కార్యక్రమంలో అర్చకులు శివరాంప్రసాద్ శాస్త్రి, సిరికొండ సాయికృష్ణామాచార్యుల చేతులమీదుగా పాత్రలను ఆలయానికి అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



తిరుమలగిరిలో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



తిరుమలగిరిలో పంచాంగ శ్రావణం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): శ్రీవిశ్వవసు నామ ఉగాది పండుగను ఆదివారం జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే తలంటుస్నానమాచరించి నూతన దుస్తులు ధరించి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి చేసి అందరికీ పంచిపెట్టారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

ఉగాది పండుగ సందర్భంగా జగ్గయ్యపేట మండలం తిరుమలగిరిలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కొండ కింద స్వామివారికి ప్రత్యేక పాలపొంగళ్ళు తయారు చేసుకొని నైవేద్యం సమర్పించారు. ముఖ్యంగా రైతులు పాడిపంటలు సంవృద్ధిగా ఉండాలంటూ ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను కొండచుట్టూ గిరి ప్రదక్షిణలు చేయించారు. అంతేకాకుండా వ్యవసాయంలో వినియోగించే ట్రాక్టర్లు, నాగళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో స్వామి వారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. స్వామి వారికి లడ్డు ప్రసాదాల, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.5.86 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఏసీ ఎం.కె.టి.యన్ వరప్రసాద్ తెలిపారు. ఆదేవిధంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం అర్చకులు పంచాంగ శ్రావణం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా వేదాద్రి



ప్రత్యేక అలంకరణలో చిట్టేల వెంకటేశ్వరుడు



వేదాద్రిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గ్రామంలో వేంచేసి ఉన్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రావణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సురేష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే లేచి ఇళ్ల ప్రధాన ద్వారాలకు మామిడి ఆకులను కట్టుకుని పొంగళ్లు పొంగించారు. ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. రైతులు తాము పండించిన పంటలో మొదటిభాగాన్ని తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు కొత్త వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఆలయాల వద్ద పంచాగ శ్రవణాన్ని నిర్వహించారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు:మండల ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. జుజ్జూరు గ్రామంలో వేంచేసియున్న రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఆవరణలో అర్చకులు విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం పంచాంగ శ్రణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నందిగామలో ఘనంగా పండుగ వేడుకలు

నందిగామటౌన్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను నందిగామ పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఉదయాన్నే ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పంచిపెట్టారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి,సీతారామాంజనేయస్వామి, దత్తాత్రేయ స్వామి ఆలయాలతోపాటు గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాలలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించి పంచాంగాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసంఘం ప్రతినిధులు కామేశ్వర ఘనాపాటి, శశాంక్, సదాశివ రావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: మండలంలో ఉగాది పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయం, మాగల్లులోని మదనగోపాలస్వామి, 108 అడుగుల రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాల్లో అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆయా ఆలయాల్లో వేద పండితులు, అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న అర్చకులు

కాంతులీనుతున్న మసీదులు



విద్యుత్ కాంతుల వెలుగుల్లో పట్టణంలోని చిన్న మసీదు



శోభాయమానంగా వెలుగుతున్న పెద్ద మసీదు



రంజాన్ పండుగ సందర్భంగా నమాజ్‌కు సిద్ధమైన ఈద్గా

నందిగామరూరల్: పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. శవ్వాల్ నెల ప్రారంభసూచికగా ఆదివారం సాయంత్రం నెలవంక దర్శనంతో సోమవారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగ జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమవుతున్నారు. నెలరోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లింలు ఆదివారం దీక్షలను విరమించారు. రాత్రికి మగ్రీబ్ నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరినొకరు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. రంజాన్ నేపథ్యంలో పట్టణంలోని పెద్ద మసీదు, చిన్న మసీదు ప్రాంతాల్లో ముస్లింల నమాజ్‌లు, పండుగ ఏర్పాట్లతో సందడి వాతావరణం నెలకొంది.

ప్రత్యేక నమాజ్‌లకు ఈద్గా సిద్ధం..

రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించేందుకు పట్టణంలోని ఈద్గాను ముస్లిం మతపెద్దలు సిద్ధం చేశారు. ఈద్గాకు సున్నం వేయడంతోపాటు నేలను చదును చేసి నమాజ్ చేసుకునేందుకు వీలుగా వసతులు కల్పించారు. పండుగ రోజు ముస్లింలు ఈద్గాకు వెళ్లి ఈదుల్ ఫితర్ నమాజ్ చేస్తారు. అదేవిధంగా పండుగను పురస్కరించుకుని నందిగామలోని రెండు మసీదులను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌కాంతులతో మసీదులు కాంతులీనుతున్నాయి.

రంజాన్‌లో ఫిత్రా, జకాత్‌లకు ప్రాధాన్యత..

పవిత్ర రంజాన్ పండుగలో ఫిత్రా, జకాత్‌లకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం గోధుమలు, నగదును పేదలకు దానం చేయాలని తెలిపేదే ఫిత్రా. రంజాన్ మాసంలో నిర్వర్తించే కఠోర ఉపవాసాలతోపాటు నమాజ్, సెహర్, ఇఫ్తార్, ధానధర్మాలు తదితర కార్యక్రమాల్లోని లోపాలను సరిదిద్దుకునేందుకు ఫిత్రా చెల్లిస్తారు. పేదరికంతో పండుగ జరుపుకోలేని వారికి ఫిత్రా చెల్లిస్తారని మత పెద్దలు చెబుతున్నారు. రంజాన్ మాసంలో చేసే ధానధర్మాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. మనిషి ఆరోగ్యం, తాను సంపాదించిన దానిపై అల్లాహ్ సూచించిన భీమానే జకాత్‌గా పిలుస్తారని చెబుతున్నారు. పండుగ తర్వాత కూడా ప్రతి ముస్లిం ఇదే జీవన విధానాన్ని పాటించాలని ముతవల్లి మహ్మద్‌ఖాజా సూచించారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన చిన్న మసీదు వీధి

వైభవోపేతంగా పుట్ట తిరునాళ్ల



భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌బాబు, పెదబాబు తదితరులు

కంచికచర్ల : కంచికచర్లలోని జుజ్జూరురోడ్డులో ఉన్న నాగేంద్రస్వామి పుట్ట తిరునాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ తిరునాళ్లకు కులమతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు అందరూ కలసి వచ్చి స్వామివారిని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. ముస్లిం మహిళలు కూడా పుట్ట తిరునాళ్లలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారికి పొంగళ్లు పెట్టారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చెవిపోగులు కుట్టించారు. భక్తులు నాగేంద్ర స్వామి చిత్రపటంను ప్రభపై ఉంచి ఊరేగింపుగా పుట్టవద్దకు తీసుకువచ్చారు. భజన పాటలు, కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలవ పెదబాబుల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు, కమిటీసభ్యులు 2వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు.



నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కనులపండువగా కల్యాణోత్సవం



జయంతి గ్రామంలో నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వీరులపాడు:మండలంలోని జయంతిలో వేంచేసియున్న వెంకయ్య స్వామి, రమణమ్మ, పేరంటాళ్ల అంకమ్మ అమ్మవారు ఆలయ ఆవరణలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామివారి కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆచార్య కోళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. 15మంది దంపతులు పీటలపై కూర్చున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు. మంగళవాయిద్యాలు, భక్తులు గోవింద నామాల నడుమ స్వామివారి కళ్యాణాన్ని వేదోక్తంగా జరిపించారు. అనంతరం పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంతోపాటు పరిసర ప్రాంతా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కల్యాణ మండప నిర్మాణం
కాగితాలకే పరిమితం



తిరుమలగిరిలో కొండ కింద స్వామివారి కల్యాణం జరిగే మండపం

- ఏప్రిల్ 11 నుంచి స్వామి వారి కల్యాణోత్సవాలు..
- కల్యాణ వీక్షణంలో భక్తులకు తప్పని ఇబ్బందులు
- శాశ్వత కల్యాణ మండపాన్ని నిర్మించాలని భక్తుల డిమాండ్

తిరుమలగిరి(జగ్గయ్యపేట): రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంతో ప్రసిద్ధి గాంచిన తిరుమలగిరిలోని శ్రీవాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల నిర్వహణకు అవసరమైన శాశ్వత కల్యాణ మండప నిర్మాణంపై పాలకులు, దేవదాయశాఖ అధికారులు దృష్టిసారించడం లేదు. ఆలయానికి ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ స్వామివారి కళ్యాణం జరిగే కొండకింద శాశ్వత కళ్యాణ మండప నిర్మాణం మాత్రం చేపట్టడం లేదు. ఏప్రిల్ నెల 11నుంచి 16వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా మండపం, సందరీకరణ కోసం ఆలయ అధికారులు ఏటా రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఖర్చుచేస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసే మండపం సైతం స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు వీలుగా లేకపోతుండటంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి వ్యక్తంచేస్తున్నారు.

అంచనాలకే పరిమితం..

స్వామివారి ఆలయానికి ఏటా వివిధ రూపాల్లో కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. స్వామివారి కల్యాణ మండపం నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. కల్యాణ మండపం నిర్మాణం కోసం అధికారులు అంచనాలు తయారీ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా పదేళ్ల కిందట శాశ్వత కళ్యాణ మండపం, కొండ మీదకు ఘాట్ రోడ్డు అభివృద్ధి, లిఫ్టు తదితర ఏర్పాట్లకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్ సైతం కాగితాలకే పరిమితమైంది.

పట్టించుకోని అధికారులు, పాలకవర్గం..

వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మండపం ఏర్పాటుపై పాలకవర్గాలు కనీసం పట్టించుకోవడం లేదు. వారి కాలపరిమితి మేరకు ఉండి వెళ్తున్నారు తప్ప ఆలయ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కళ్యాణ మండపం నిర్మాణానికి ఈ ప్రాంతంలోని దాతలు ముందుకు వస్తున్నా ఆలయ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు స్పందించి స్వామివారికి శాశ్వత కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఆలయం వద్ద స్వామివారి శాశ్వత కల్యాణ మండపం ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. మరోసారి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– వరప్రసాద్, ఆలయ ఏసీ

ముగిసిన ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):స్థానిక ముత్యాలంపాడు ఎంఎస్‌మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిత్రకళా ప్రదర్శన కళాకారుల సత్కారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్, ప్రొఫెసర్ అట్లూరి వెంకటరత్నప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిభింబిస్తాయని కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు మాట్లాడుతూ చిత్రకళ అభివృద్ధికి ఎంఎస్ మూర్తి అందించిన సేవలను పురస్కరించుకుని ఆయన శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సిద్ధార్థ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవిచంద్, అకాడమీ కార్యదర్శి సాయిబాబు కలిసి చిత్రకారుడు ఎస్ నాగేశ్వరరావు, కళా సేవకులు అయోధ్య నాగేశ్వరరావు, బీ నగేష్‌కుమార్, ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారగ్రహీత ఏ గిరిధర్‌లను సత్కరించారు.

ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని కలిగి ఉండాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని కలిగి ఉండాలని లయన్స్ ఇంటర్నేషన్ 316డీ–జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. లయన్స్ ఇటర్నేషనల్ 316డీ–జిల్లా 22వ సేవా మహోత్సవాన్ని స్పందన పేరుతో స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ సేవ ఎక్కడ అవసరమో అక్కడ తమ లయన్స్ క్లబ్ సభ్యులు ఉంటారని చెప్పారు. వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, విద్యార్థినులకు సైకిళ్లు, మహిళలకు స్వయం ఉపాధికి ఆర్థిక సాయంతోపాటు గ్రైండర్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు ఇలా సుమారు రూ.20 లక్షలకు పైగా విలువైన సామగ్రిని అందజేశామని తెలిపారు. లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ ఆంజనేయులు, పాస్ట్ గవర్నర్లు మిరియాల వెంకటేశ్వరరావు, కంకణాల శ్రీనివాసరావు, వీవీ సాయి వరప్రసాద్, క్లబ్ జిల్లా సభ్యులు శ్రీనివాసరెడ్డి, యర్రంశెట్టి శ్రీనివాసరావు, సుంకరకృష్ణ, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా మారిన గొయ్యి

కంచికచర్ల : మండలంలోని మోగులూరులో లారస్ అధినేత చావా సత్యనారాయణ నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ కంచికచర్ల మండలానికి వస్తున్నారంటూ గతనెలలో ఆర్అండ్‌బీ అధికారులు వేసిన రోడ్డు అప్పుడే అక్కడక్కడ ధ్వంసమైంది. రోడ్డు వేసిన నెలరోజుల్లోనే రోడ్డుపై గొయ్యి పడింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే కంచికచర్ల, బత్తినపాడు, చెవిటికల్లు గ్రామాల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించలేదని వారు మండిపడుతున్నారు. రోడ్డు చివరన ఇలా గొయ్యిపడటంతో ప్రమాదాల బారినపడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై పడిన గొయ్యిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డులో పడిన పెద్ద గొయ్యి